# కళ్ళజోడు

తృప్తి

ఆదొక గవర్నమెంట్ ఆఫీస్. పనితో అలిసిపోయిన ఎక్కౌంట్స్ స్టాఫ్ కాంటీన్‌లో చేరి చాయ్ తాగుతూ రిలాక్సవుతున్నారు.

"చూడు గురూ! ఆ ఎడ్మినిస్ట్రేషన్ సెక్షన్ టైపిస్ట్ రామూ రోజూ లేటొచ్చి హాయిగా రిజిష్టర్‌లో సంతకం పెడుతున్నాడు. మనకొక నిమిషం లేటయితే రెడీమార్క్!" ఒక సీనియర్ క్లర్క్ జరుగుతున్న అన్యాయాన్ని అందరి దృష్టికీ తీసుకువచ్చాడు.



"నిజమే గురూ! మనం లేట్లో సైన్ పెడుతుంటే తను మాత్రం దర్జాగా సెక్షన్‌లోకి పోతాడు." మరో జూనియర్ స్పందిస్తూ అన్నాడు.

"అవునండీ నిజమే! నేనూ గమనించాను" అన్నాడు శంకర్.

"నేను కూడా!" అన్నాడు రాఘవరావ్.

"ఏమైనా ఈ విషయం ఎడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ దృష్టికి తీసుకుపోవాలి"

"అవును. ఊరుకుంటే లాభం లేదు. మనకేనా రూల్స్? వాళ్ళకి లేవా? వాళ్ళు కూడా స్టాఫే కదా! ఇవాళ ఆ సీట్లో ఉన్నారని వెలిగిపోతారా? రేపు మన సీట్లలోకి వాళ్ళురారా! అడగాలి. ఇదన్యాయం గట్టిగా అడగాలి."

అంతా ఏకగ్రీవంగా ఈ విషయాన్ని ఫిర్యాదుచెయ్యాలన్న నిర్ణయానికి వచ్చారు.

ఇంతలో అటుగా వచ్చిన ఎస్టాబ్లిష్‌మెంట్ సీనియర్‌క్లర్క్ వెంకట్‌ని పట్టుకుని విషయం వివరించారు. తిన్నగా ఏ.వో. దగ్గరికి ఎందుకులే అన్నట్టుగా వెంకట్ శ్రద్ధగా వింటున్నాడు.

ప్రతిమనిషికీ చుట్టూ ఉన్న పరిస్థితులు ఒక్కలాగే కనబడతాయి. ఒక్కలాగే వినబడతాయి. కానీ ఎవరికి వారు స్వంత కళ్ళజోళ్ళు తమ అవసరానికి తగ్గట్టుగా తయారు చేసుకుని ఉంటారు. అవి పెట్టుకుని విశ్లేషించి చూసేసరికి అన్ని విషయాలూ మీరోలా కనబడి, మరోలా వినబడతాయి. దాన్నిబట్టివాళ్ళు ప్రవర్తిసారు. దీన్నే మన పెద్దలు లౌక్యం అనీ, బతకనేర్చినతనం అనీ అంటుంటారు.

అంతావిన్న వెంకట్ "ఒ.కే. అలాగేనర్రా! నేనే విషయం మన ఏ.వో.గారికి చెబుతాను. యూ డోంట్ వర్రీ! నేను చూసుకుంటాను కదా" అనేసి వెళ్ళిపోయాడు. వాళ్ళంతా "అమ్మయ్య! ఒక అన్యాయాన్ని అరికట్టడానికి మన ప్రయత్నం మనం చేశాం" అన్నట్టుగా నిట్టూర్చారు.

వెంకట్ సీట్లో కూర్చుని తన సొంత రాజకీయ కళ్ళజోడు పెట్టుకుని ఆలోచించాడు. 'ఆ మధ్య రాము బాస్‌కి మరీ క్లోజయిపోయి తనని దూరం చేస్తున్నాడు. ఈ దెబ్బకి రాము లైన్లోకొస్తాడు. బానే ఉంటుంది. కానీ విషయాన్నిలాగే బాస్ చెవినవేస్తే "మన సెక్షన్ గురించి మన దగ్గరే విమర్శిస్తూంటే ఏదొకటి చెప్పి సమర్థించేదిపోయి రాయబారం తెస్తావా?" అని చివాట్లు పెట్టొచ్చు.

'కాబట్టి ఏం చెయ్యాలీ?'అని దీర్ఘంగా యోచించి చివరికి ఎవరి ద్వారానో విన్నట్టుగా విషయాన్ని ఏ.వో.చెవినవేశాడు.

ఏ.వో. ఒక్కక్షణం దిమ్మెరపోయాడు. తేరుకుని వెంటనే బుర్రకి కళ్ళజోడు తగిలించిగమనించాడు. ' ఈ వంకపెట్టి రామూకి ఏ మెమో అన్నా ఇచ్చానంటే బానే ఉంటుంది. మొత్తం ఆఫీసుముందు తాను చాలా ఖచ్చితమైన మనిషి అన్నట్టు ఫోజ్ కొట్టొచ్చు. కానీ రాముగాడు కోపంతో ఇప్పుడు జరుగుతున్న ట్రాన్స్‌ఫర్ సీక్రెట్లన్నీ బైటపెట్టి పరువుతియ్యగలడు.

చిన్నగా నవ్వుతూ "బానే ఉంది కానీ ఈ విషయం ఎవరినన్నా స్వయంగా వచ్చి చెప్పమనవయ్యా! మనకి మనమే యాక్షన్ ఎలా తీసుకుంటాం? బావుండదు కదా!" అని సర్దాడు.

ఈ వార్తని వెంకట్ స్టాఫ్‌కి మోసుకుపోయాడు. "ఇది గురూ పరిస్థితి! మీలో ఎవరో ఒకరు నాతో రండి" అన్నాడు. వెంటనే వాళ్ళందరూ తమతమ కళ్ళజోళ్ళను ధరించి పరిస్థితిని అవలోకించారు. 'తీరావెళ్ళి కంప్లైంట్ ఇస్తే మన పేరు బైటికొస్తుంది. అక్కడేదన్నా రివర్స్ కొట్టిందంటే ట్రాన్స్‌ఫర్ రామూక్కాదు మనకొస్తుంది.'- అనుకుని 'నువ్వెళ్ళు వెంకట్! మేం తర్వాత వస్తాం" అని అతన్ని పంపేశారు.

అందరూ బాగా చర్చించి చివరికి "ఈ విషయం మన యూనియన్ ప్రెసిడెంట్

గారికి చెబితే సరిపోతుంది. ఆయనే చూసుకుంటాడు" అన్న నిర్ణయానికి వచ్చారు.

అందరూ మూకుమ్మడిగా ప్రెసిడెంట్ రూమ్‌కి పోయి పరిస్థితిని వివరించారు.

చిరునవ్వుతో విన్నాడు ప్రెసిడెంట్. "తప్పకుండా న్యాయం జరిగేలా చూస్తాను. అందరూ సమానమే ఇక్కడ. ఒకరెక్కువా ఒకరు తక్కువా కాదు నా దృష్టిలో. మీరు చేసింది చాలా మంచిపని. ఇలా చెప్పడం వల్ల నాకు విషయం తెలిసింది. నేను వెంటనే కనుక్కుని పరిస్థితిని సరిచేస్తాను. థాంక్యూ వెరీమచ్" అన్నాడు హుందాగా. అందరూ ఆనందంగా నిష్క్రమించారు.

వాళ్ళు వెళ్ళాక ప్రెసిడెంట్ తీరిగ్గా తన రాజకీయ కళ్ళజోడులోంచి సిట్యుయేషన్‌ని తిలకించాడు. వెంటనే కంప్యూటర్ రిపోర్ట్ బుర్రలోకొచ్చింది. 'తను యూనియన్ ప్రెసిడెంట్‌గిరీ అడ్డం పెట్టుకుని అడ్డదారిలో ప్రమోషన్ కొట్టానని చెవులు కొరుక్కున్నది ఈ



సెక్షన్ వాళ్ళేనట.

పైగా తనకి వీళ్ళెవరూ ఓట్లు వెయ్యలేదని సి.బి.ఐ. రిపోర్ట్ కూడా ఉంది. అనుకుని 'ఇక వీళ్ళ సంగతి ఆలోచించేపనే లేదు. ఏం పీక్కుంటారో చూస్తాను. పెద్దవీరుల్లా బయలుదేరారు. ఇప్పుడు గుర్తొచ్చాడేమో ప్రెసిడెంట్! దొంగమొహాలు! నాకు ఓటు వెయ్యమంటే వేశారా? నాకు తెలీదనుకుంటున్నారు వీళ్ళు ఓటెయ్యని విషయం! అయినా నా సొంత (మనుషుల) పనులే బోలెడున్నాయి. అవి చూసుకోవాలి కదా! వీళ్ళకోసం నేను ఏ.వో.గారితో గొడవపడతానా? వెర్రివెంగళాయిలు గుంపుగా వచ్చారు" నవ్వుకుంటూ పనిలో పడ్డాడు.

రాము ఎప్పట్లానే బోలెడు లేటొచ్చి దర్జాగా రిజిస్టర్‌లో సంతకాలు పెట్టుకుంటున్నాడు. ఉమ్మడిగా, ధైర్యంగా అన్యాయాన్ని ఎదుర్కొనే సామర్థ్యం లేని సామాన్యజనంలాంటి స్టాఫ్ "అన్నీ పాలిటిక్స్ గురూ! మనవల్ల ఏమీ కాదు. అన్నీ చూస్తూ ఉరుకోవాల్సిందే!" అని బుడిబుడి దుఃఖాలు, రాగాలు తీస్తున్నారు.

# "నాదో వింత సమస్య... ఏమిటి దీనికి పరిష్కారం?"

**నా** వయసు ఇరవై రెండు సంవత్సరాలు. ఒక ప్రైవేట్ హాస్పిటల్‌లో పనిచేస్తున్నాను. పెళ్లికూడా ఈ మధ్యనే అయింది. ఇప్పటివరకు బాగానే వున్నాను. పెళ్లయిన తర్వాతే నాలోని మరో మనిషి నిద్రలేచిన భావన కలుగుతోంది. నా భార్యమీద విపరీతమైన అనుమానం. కాని ఆ అమ్మాయి అలాంటిది కాదు. మంచిదే! హాస్పిటల్‌కి వచ్చే అమ్మాయిల్ని చూస్తుంటాను కదా!...అనుమానం. కొంతమంది పెళ్లికాకుండానే అబార్షన్లు చేయించుకోవడానికి వస్తుంటారు. 'ఈ అమ్మాయి కూడా...!?' అని అనుమానం. ఇలా ఆలోచించడం తప్పని తెలుసు. అయినా ప్రవర్తనను మార్చుకోలేను. నా భార్యను ఎవరితోనూ మాట్లాడనివ్వను. మగవాళ్లతో మాట్లాడే ప్రసక్తే లేదు. బయటివాళ్లే కాదు, దగ్గరి బంధువులు ఎవరొచ్చినా అనుమానమే. వాళ్లు వెళ్లాక బాగా తిడతాను. తర్వాత బాధ పడతాను. నాదో వింత సమస్య. ఎందుకిలా? ఏమిటీ దీనికి పరిష్కారం?

**-శ్రీనివాసరావు,**
గోదావరిఖని

**మ**నిషెప్పుడూ తనని తాను ఎదుటి వాళ్లతో పోల్చుకుంటాడు. పోల్చుకున్న వ్యక్తి కంటే తన పరిస్థితి ఉన్నతంగా ఉంటే తనంత మొనగాడు లేడని విర్రవీగుతాడు. అవతలి వ్యక్తికంటే తన పరిస్థితి తక్కువ అని తేలిననాడు ఎక్కడాలేని ఆత్మన్యూనతకు గురవుతాడు. దాంతో తాను సమర్థుడ్ని కాదనుకుని, తనలోనే ఏదో లోపం వుందని, ఇన్ఫీరియారిటీ కాంప్లెక్సు పెంచుకుని నెమ్మదిగా అనుమానం, అసూయ అకారణమయిన ద్వేషం పెరిగిపోతాయి.

తమలో పెరుగుతున్న కాంప్లెక్సు బయటపడకుండా ఉండటానికి తన ఆధిక్యతని నిరూపించుకునే ప్రయత్నంలో పెద్దగా అరవడం, చీటికి మాటికి ఎదుటి వ్యక్తులపై కోపం ప్రదర్శించడం, గొడవలు చేయడం, సమీప వ్యక్తులపై ఆంక్షలు విధించడం చేస్తుంటారు.

కొన్నిసార్లు ఇలాంటి వ్యక్తుల్లో పొసెసివ్ నేచర్ ఎక్కువవుతుంది. అంటే మనకు సొంతమనుకున్న వ్యక్తులు ఇతరులతో మాట్లాడినా, కాస్త చనువుగా వున్నా భరించలేరు, సహించలేరు. అదే వస్తువుల విషయంలో అయితే వాటిని ఎవరికీ అందకుండా ఉంచుతారు. వాటిని ఎవరయినా తాకినా, చివరికి చూసినా విపరీతమైన ఆవేశాన్ని ప్రదర్శిస్తారు.

బహుశ మీ పరిస్థితికూడా ప్రస్తుతం ఇలాంటిదే. మీరు మానసికంగా ఈ దశకు చేరిపోయారు కూడా! కాబట్టి పరిష్కారం అనివార్యమే కాదు... అత్యవసరంకూడా!

మీ భార్య మంచమ్మాయి అని మీరే అంటున్నారు. వెరీగుడ్....మరి అనుమానం ఎందుకు? మనిషి హాయిగా నవ్వడానికి, మాట్లాడ్డానికి సుఖదుఃఖాలు పంచుకోవడానికి స్వేచ్ఛ కావాలి. అది చాలా అవసరం. అనవసరమైన అనుమానాలతో ఆమెను కట్టుదిట్టం చేయకండి. చివరికి సొంత అన్నదమ్ములతో సైతం మాట్లాడలేని పరిస్థితులు కల్పించకండి. మీ కోపం వెనకున్న అసలు కారణం ఆమె మీదున్న అనుమానాలు మాత్రమేనని తెలసిననాడు- మీ భార్య దృష్టిలో మీకు అణువంతయినా విలువ మిగల్దు. 'అనుమానం పెనుభూతం' అంటారు. అది తలెత్తగానే దాన్ని సమూలంగా నాశనం చేయడం అనివార్యం. నలుగురు ముందుకు ధైర్యంగా వెళ్లాలన్నా, మీలోని పిరికితనం అనవసరమైన భయాందోళనలు పోవాలన్నా-ఆత్మ విశ్వాసాన్ని పెంచుకోవాలి. అంటే మనిషిలో వుండే పాజిటివ్ అండ్ నెగెటివ్ లక్షణాల్లో పాజిటివ్ లక్షణాల్ని ఫోకస్ చేసుకుని నెగెటివ్ లక్షణాల్ని తగ్గించుకునే ప్రయత్నం చేయండి. అంతేగాని మీచుట్టూ ఉన్న పరిస్థితులను అనవసరమైన గొడవలతో మరింత సంక్లిష్టం చేసుకుని సుఖంగా, హాయిగా సాగిపోవాల్సిన కొత్త సంసారాన్ని కలతలతో, అర్థంలేని అనుమానాలతో ముళ్లకంపలా మార్చేసుకోకండి.

**-పద్మజా వాసుకి,**
సైకాలజిస్టు

మీ సమస్య మానసికం, శారీరకం, వృత్తి సంబంధం, లీగల్, మెడికల్ ఏదైనా కావచ్చు.
'ఆదివారం-వార్త' ప్రియపాఠకులకోసం ప్రారంభించిన ఈ శీర్షిక మీదే!
మీ సమస్యల కనుగుణంగా ఆయా సంబంధిత రంగాలకు చెందిన వృత్తినిపుణులు సలహాలిస్తారు. మీ సమస్యలు పంపవలసిన చిరునామా:

పరిష్కారం, ఆదివారం వార్త
డిబిఆర్ మిల్స్‌రోడ్, లోయర్‌ట్యాంక్‌బండ్, హైదరాబాద్-500 080